# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 11, సెప్టెంబర్ 2025


## భవన నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**నస్పూర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త**

ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, హాజీపూర్ మండలం గుడిపేటలో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో గల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు, హాజీపూర్ మండలం గుడిపేటలో నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు మరింత వేగవంతమైన వైద్య సేవలను అందించేందుకు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఆధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేసి జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. వైద్యులు, సిబ్బంది సంఖ్యను పొందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేసేందుకు 216 కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనూష, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాసర ఆర్జీయూకేటీ అభివృద్ధికి చర్యలు

- యూనివర్సిటీ విద్యార్థులతో మంత్రి ముఖాముఖి
- జీవితంలో ఒడిదుడుకులు సహజం
- క్షణిక ఆవేశంలో ఆత్మహత్యకు పాల్పడటం పిరికిపంద చర్య
- బాసరలో పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఉమ్మడి అదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త**

నిర్మల్ జిల్లాలోని బాసరలోనీ ట్రిపుల్ ఐటి (ఆర్జీయూకేటీ)ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖల మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం బాసర పర్యటనలో భాగంగా మంత్రి ఎంపీ నాగేష్‌తో క్యాంపస్‌ను సందర్శించి సుమారు రూ.1.7 కోట్ల విలువైన మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన చేశారు. విద్యార్థులతో ముఖాముఖి సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవ్వాలన్నారు. విద్యార్థులకు సమస్యలకు సానుకూలంగా స్పందించిన మంత్రి, పరిష్కరించగలిగిన వాటిని వెంటనే చర్యలు తీసుకుంటానని, మిగతావి సంబంధిత మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు.

### సమస్యలు సహజం.. అధిగమించాలి..

నేటి యువత చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు మంత్రి. జీవితంలో ఒడిదొడుకులు సహజమని, విఫలమైతే ఆగిపోవడం కాదు. మళ్లీ లేచి నిలబడాలంటూ విద్యార్థులను ప్రేరేపించారు. మొబైల్ ఫోన్లలో మునిగితేలుతూ విలువైన సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. పండగలు, ఆటపాటల పట్ల ఆసక్తి పెంచుకోవాలని కోరారు. బాసర ట్రిపుల్ ఐటి సాంస్కృతిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.1 కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో విద్యార్థులకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులతో భోజనం చేసి, కొత్త యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, విద్యార్థులకు అన్ని విభాగాల్లోనూ నాణ్యమైన విద్య, వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. బాసర అమ్మవారిని దర్శించుకున్న మంత్రి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు





వేద మంత్రాల నడుమ పూర్ణకుంభంతో ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిని ఆలయ అధికారులు శాలువాతో సత్కరించి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రి జూపల్లి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులతో సమావేశం నిర్వహించి ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.190 కోట్ల వ్యయంతో బాసర ఆలయ మాస్టర్ ప్లాన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో చర్చించి బాసర అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాసరను ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న మిగతా 2లో..

# పెత్తందారుల అణిచివేతను ప్రశ్నించిన వీరవనిత చాకలి ఐలమ్మ

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త**

తెలంగాణ సాయుధ, భూ పోరాట ఉద్యమంలో కీలకపాత్ర పోషించి పెత్తందారుల అణిచివేతను ప్రశ్నించిన వీరవనిత చాకలి ఐలమ్మ అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పెత్తందారుల అణచివేతను ప్రశ్నించిన వీరవనిత చాకలి ఐలమ్మ అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిందని, సాగు చేసే వారికి భూమి కోసం ఉద్యమించిందని తెలిపారు. తెలంగాణ భూ పోరాటానికి నాంది పలికిన మొదటి వ్యక్తి చాకలి ఐలమ్మ అని తెలిపారు. నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడం జరుగుతుందని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారుల సమన్వయంతో



పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా నిరుపేదలకు 10 లక్షల రూపాయల వరకు విలువైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. పట్టుదల, ఏకాగ్రతతో పని చేస్తే సామాన్యుడు కూడా సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగి అందరికీ ఆదర్శంగా నిలువచ్చని అన్నారు. మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగుదామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త**

బి జోన్ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు నడిగోట తిరుపతి, గౌరవాధ్యక్షుడు మడికంఠ రాజయ్య, మహిళా అధ్యక్షురాలు జాలిగం రాజేశ్వరి పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్ముణ్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు తంగళ్ళపల్లి వెంకటేష్, జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు హాజరై నివాళులు అర్పించారు. సమాజ అభ్యున్నతి కోసం చాకలి ఐలమ్మ పోరాటం ఆదర్శప్రాయమని, ఆమె స్ఫూర్తి కొత్త తరాలకు మార్గదర్శకమని నాయకులు పేర్కొన్నారు.

**వాంకిడి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త**

వాంకిడి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతినీ ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో ఖాజా అజిరుద్దీన్ మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన చాకలి (చిట్యాల) ఐలమ్మ తెలంగాణ పోరాట స్ఫూర్తికి నిదర్శనమని అన్నారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన విప్లవ నిప్పుకణిక ఐలమ్మ, భూమి కోసం, భుక్తి కోసం తిరుగుబాటు చేసి ప్రజా వ్యతిరేక పాలనపై దండెత్తిందని గుర్తు చేశారు. చాకలి ఐలమ్మ పోరాటాలను, త్యాగాలను భావితరాలకు అందించాలనీ ఖాజా అజీజుద్దీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాసర ఆర్జీయూకేటీ అభివృద్ధికి చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

గోదావరి పుష్కరాల కోసం ఇప్పటికే పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేలా అన్ని శాఖలతో సమన్వయం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై తాను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నానని వివరించారు.

### బాసరలో నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన..

నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.5.75 కోట్ల వ్యయంతో 30 పడకల ఆసుపత్రిని నిర్మించనున్నట్టు మంత్రి తెలిపారు. ఆసుపత్రి పూర్తయితే బాసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు.అనంతరం మంత్రి జూపల్లి భారీ వర్షాల వల్ల బాసర పరిసరాల్లో నష్టపోయిన పంట చేనులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట వివరాలు, పెట్టుబడి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు తప్పక నష్టపరిహారం అందజేస్తామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతుల వివరాలు, నివేదికలు త్వరితగతిన అందజేయాలనీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, నాయకులు ఇంద్రకరణ్ రెడ్డి, విఠల్ రెడ్డి, వేణుగోపాల చారి, నారాయణ రావు పటేల్, యూనివర్సిటీ ఉపకులపతి గోవర్ధన్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, డీఎంహెచ్వో రాజేందర్, వ్యవసాయశాఖ అధికారి అంజి ప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ పెట్రోల్ పంపు పాఠశాలలో ఆర్జేడీ ఆకస్మిక తనిఖీ

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెట్రోల్ పంపు పాఠశాలను ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జెడి )సత్యనారాయణ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పనితీరు, విద్యా నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు డిజిటల్ తరగతుల ద్వారా ఆధునిక పద్ధతిలో బోధన అందించాలి. విద్యార్థులు చదువుపై ఆసక్తి కలిగి ఉండేలా చేయాలి. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు పాఠ్యపుస్తకాలు, గ్రంథాలయపుస్తకాలు చదివే అలవాటు విద్యార్థులకు ఉండాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు ఇప్పటినుంచి ప్రత్యేక పాఠాలు నిర్వహించాలన్న దిశగా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, పెంచికలపేట మండల విద్యాధికారి తోట రమేష్ బాబు, గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వెంకట రాజయ్య, ప్రమీల దేవి, పర్స చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లోని డయాలసిస్ సెంటర్‌ను విస్తరించాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త

కాగజ్‌నగర్‌లోని డయాలసిస్ సెంటర్‌ను విస్తరించాలని హైదరాబాద్‌లో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహని ఆరోగ్య శ్రీ కార్యాలయం సిర్పూర్ శాసన సభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన 90 మంది కిడ్నీ రోగులకు డయాలసిస్ అవసరం ఉన్నదని, ప్రస్తుతం కాగజ్ నగర్ డయాలసిస్ సెంటర్లో 5 పడకలు మాత్రమే ఉన్నాయని, దీనిని 10 పడకలుగా విస్తరించాలని కోరారు. అలాగే కౌటాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరో డయాలసిస్ సెంటర్ మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించి మంత్రి వైద్య ఆరోగ్య కార్యదర్శికి తగు ఆదేశాలు జారీ చేశారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ మాజీ జడ్పీటీసీ నీరటి సత్యనారాయణ పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన ఎంపిడిఓ

తిర్యాని, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:

తిర్యాని మండలంలోని గోయాగాం గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను బుధవారం తిర్యాని ఎంపిడిఓ మల్లేష్ ఎంపిడిఓ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నిర్వహణ, తరగతుల బోధనాపద్ధతులు, త్రాగునీటి సదుపాయాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల సామార్థ్యాలను పరీక్షించి పరిశుభ్రతతపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేశారు. విద్యార్థులకు కథల పుస్తకాలను అందజేస్తామని అలాగే పాఠశాలలకు ఏమైనా వసతులు లేకుంటే వాటిని తమ దృష్టికి తీసుకుని వస్తే వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## తిర్యాని ఎస్ఐగా వెంకటేష్

తిర్యాని, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త

తిర్యాని నూతన ఎస్ఐ గా ఎస్ వెంకటేష్ బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పని చేస్తామని, ప్రజలకు ఏ అవసరం ఉన్న నేరుగా వచ్చి తమకు కలువ వచ్చని ఆయన పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు, అధికారులు, పత్రికా విలేకరులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నారాయణ రాథోడ్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది శంకర్, రజిత, మల్లేశ్వరి, జంగు, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు మెరుగైన వైద్య సేవలు

### వైద్య నిపుణుల నియామకానికి చర్యలు - డివైసీఎంవో పాండురంగ చారి



బెల్లంపల్లి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త

బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఈ ప్రాంత కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ పాండురంగ చారి తెలిపారు. ఆస్పత్రిలో రోగుల తాకిడి పెరగడంతో పాటు ఇన్‌పేషెంట్లు కూడా పెరుగుతున్నారన్నారు. ఆసుపత్రికి పూర్వవైవం తీసుకువచ్చేందుకు అన్ని విదాల కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వంద రోజుల్లో ఇక్కడ వైద్యనిపులను నియమించేందుకు ఏరియా జీఎం, సింగరేణి సీఎంఓ, కార్మిక సంఘాల, కార్మికుల సహకారంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ దృష్టికి ఈ సమస్యలు తీసుకు వెళుతున్నట్లు తెలిపారు. కార్మికులకు అందుబాటులో ఉండి ఆసుపత్రి అభివృద్ధికి ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక చేస్తున్నట్టు తెలిపారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

### - సేవా అధ్యక్షురాలు మునిగంటి ఉమరాణి



నస్పూర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ కోర్సులు నేర్చుకొని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు మునిగంటి ఉమరాణి అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ కాలనీ సీఈఆర్ క్లబ్, నస్పూర్ కాలనీ సేవా భవన్‌లో సింగరేణి సేవా సమితి వారి ఆధ్వర్యంలో గత ఆర్థిక సంవత్సరంలో టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటిషన్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ డిటిపి వంటి వృత్తి శిక్షణ కోర్సులలో శిక్షణ పొందిన మహిళా అభ్యర్థులకు రాత పరీక్షలు నిర్వహించారు. 619 మంది మహిళలు శిక్షణ పొందగా 530 మంది రాత పరీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు మాట్లాడుతూ, మహిళలు వృత్తి శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని, మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడడానికి వృత్తి శిక్షణ కోర్సులు దోహదపడతాయని, మహిళలు తాము ఉపాధి పొందుతూ నలుగురికి ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. ఇదే ఆసక్తితో మహిళలు 2025-26 ఆర్థిక సంవత్సరంలో కూడా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే కోర్సులను నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిఓ మురళి, సింగరేణి సేవా సమితి చీఫ్ కోఆర్డినేటర్ (హైదరాబాద్) డి.ఎస్ శివకుమార్, సేవా సెక్రటరీ కొట్టే జ్యోతి, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ పాల్వాయి పురుషోత్తం రావు స్మారక కబడ్డీ పోటీలు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ పట్టణంలోని సర్ సిల్క్ వెల్ఫేర్ సెంటర్ గ్రౌండ్లో దివంగత ప్రజా బంధువు, మహనేత పాల్వాయి పురుషోత్తం రావు 26వ వర్ధంతి సందర్భంగా సెప్టెంబర్ 15వ తేదీ నుండి 18వ తేదీ వరకు సిర్పూర్ నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు ఘనంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనే అర్హత గల కబడ్డీ జట్లకు సెప్టెంబర్ 13 లోపు ఫారాన్ని పూర్తి చేసి నిర్వాహకులకు సమర్పించాలని అన్నారు. అదేవిధంగా సెప్టెంబర్ 18వ తేదీన కబడ్డీ పోటీల ముగింపు సందర్భంగా పోటీల్లో గెలిచిన విజేతలకు మొదటి బహుమతి 50 వేల రూపాయలు, రెండవ బహుమతి 25 వేల రూపాయలు, మూడవ బహుమతి 15 వేల రూపాయలు అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు. క్రీడా ప్రియులు, ప్రేక్షకులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాల్సిందిగా నిర్వాహకులు కోరుతూ వివరాలకు మోని: 85199 61666, కౌశిక్: 73864 76917 ఈ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

## రెండు బైకులు ఢీ... ఒకరికి తీవ్ర గాయాలు

వేమనపల్లి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త

మండలంలోని ముల్కలపేట,రాచర్ల మధ్యలో ఉన్న మంగలీ ఒర్రె బ్రిడ్జిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఒకరికి తీవ్ర గాయాలు అయిన ఘటన వేమనపల్లి మండలంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది.స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం... ముల్కలపేట గ్రామానికి చెందిన ఆకుల అశోక్ ఇంకో వ్యక్తి రాచర్ల వైపు నుండి ముల్కలపేట వస్తుండగా, కల్మలపేట గ్రామానికి చెందిన తోకల సంతోష్ ఇరువురు ద్విచక్ర వాహనంపై వెళుతూ ఢీ కొనడంతో అశోక్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం అశోక్‌ను చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన ప్రమాద పరిస్థితులు పరిశీలించారు.

## ఓపెన్ హార్ట్ సర్జరీ అయిన కార్మికునికి అండర్‌గ్రౌండ్‌లో పనిచేసేందుకు ఫిట్ ఇచ్చిన సీఎంవో

### విధులు నిర్వహిస్తూ శాంతిఖని గనిలో కుప్పకూలిన కార్మికున్ని ఆస్పత్రికి తరలింపు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త



అస్వస్థతకు గురైన కార్మికుడు ప్రదీప్‌ను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకు వెళ్తున్న దృశ్యం

గుండె జబ్బుతో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న ఓ కార్మికునికి ఓపెన్ హార్ట్ సర్జరీ కాగా ఆ కార్మికుడికే భూగర్భగనిలో దిగేందుకు సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులు ఫిట్ ఇచ్చారు. దీంతో ఆ కర్మికుడు జెనరల్ మజ్దూర్ కార్మికుడు చెన్నూరి ప్రదీప్ బుధవారం శాంతిఖని గనిలో దిగి ఉదయం తొమ్మిది గంటల సమయంలో గనిలోని 43 వ లెవెల్‌లో చైర్ లిఫ్ట్ వద్ద మరో కార్మికునితో కలిసి ఆయిల్ డ్రం నెట్టుకుంటూ పోతున్నారు. అదే సమయంలో ఛాతిలో నొప్పి వచ్చి ఒకే సారి కుప్పకూలి పడి పోయాడు. దీంతో తోటి కార్మికులు ప్రదీప్‌ను వెలుపలకు తీసుకువచ్చి అక్కడ నుంచి వెంటనే బెల్లంపల్లి సింగరేణి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతోమంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని శాంతిఖని బొగ్గు గనిలో బుధవారం మొదటి షిఫ్ట్‌లో పనిచేస్తున్న జెనరల్ మజ్దూర్ కార్మికుడు చెన్నూరి ప్రదీప్‌కు ఛాతిలో నొప్పి రావడంతో గనిలోనే కుప్పకూలాడు. గమనించిన తోటి కార్మికులు గని వెలుపలకు తీసుకువచ్చి బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కొరకు ప్రదీప్‌ను రామకృష్ణపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కార్మికుని ఘటనపై మందమర్రి జిఎం ఎన్ రాధాకృష్ణ, ఎస్ ఓటు జీఎం విజయ ప్రసాద్‌లు ఆరా తీశారు. కార్మికునికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన క్షేమంగా ఉన్నట్టు వారు పేర్కొన్నారు.